క్లుప్తంగా

మొక్కలు నాటడం బాధ్యత

మాజీ ఎంపీపీ మల్లయ్య



మొక్క నాటి నీరు పోస్తున్న మల్లయ్య

మోమిన్‌పేట: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మొరంగపల్లిలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అందరూ వారివారి ఇళ్ల ముందు ఒక మొక్క నాటాలన్నారు. మొక్కలను విరివిగా నాటడం వల్ల భవిష్యత్‌లో వాతావరణ సమతుల్యం ఏర్పడి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ప్రస్తుతం అడవులు అంతరించి పోవడంతో సకాలంలో వర్షాలు కురువక వ్యవసాయరంగం వెనుకబాటుకు గురవుతుందన్నారు. భవిష్యత్ తరాల కోసం తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాణి, ఫీల్డ్‌అసిస్టెంట్ భిచ్చయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి

పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

దోమ: దేవాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని గుండాల గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ నిర్మాణం, ప్రతిష్ఠాపనకు రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా, రాజకీయంగా ప్రజల కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పాఠశాలకు రూ. 20వేలతో సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాలప్ప, దస్తయ్య, అంజిలయ్య, మొగులయ్య, బాల్‌రాజ్, గుడిసే అంజయ్య, మంగళి రాములు, బోయిని పెద్ద సాయప్ప, మాల వెంకటేశ్, కురువ నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు

ఏడీఏ వెంకటేశం



ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

నవాబుపేట: ప్రభుత్వ అనుమతి లేని నిషేధిత మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఏడీఏ వెంకటేశం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాప్ యజమానుల రిజిస్టర్లు, విక్రయిస్తున్న మందులు, ఎరువులు సంబంధిత వివరాలు తనిఖీ చేశారు. రైతులు నష్టపోయే విధంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ షాపుల వద్దే రైతులు ఎరువులు, మందులు కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి జ్యోతి తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి డీఈగా బాధ్యతల స్వీకరణ



ధారూరు: తాండూర్ ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి డీఈగా శ్రావణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ధారూరు మండల ఏఈగా విధులు నిర్వహించిన ఆయనకు ఆర్ అండ్‌బీ ఈఎన్‌సీ ఉన్నతాధికారి ద్వారా ఉత్తర్వులు అందాయన్నారు. రుద్రారం–నాగసమందర్ గ్రామాల మధ్యన కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు ప్రవహించే రోడ్డుపై తాత్కాలికంగా నిర్మించిన వంతెన స్థానంలో కొత్త వంతెనను నిర్మించేందుకు నిధులు మంజూరు కావాల్సి ఉందని పేర్కొన్నారు.

సీసీఐ వద్ద ఉద్రిక్తత

రెండో రోజు కార్మికుల ఆందోళన

తాండూరు రూరల్: కరన్‌కోట్ గ్రామ శివారులోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఫ్యాక్టరీ వద్ద కార్మికులు రెండోరోజు ఆందోళన కొనసాగించారు. శనివారం ఫ్యాక్టరీ గేటు వద్ద ధర్నా చేపట్టారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఫ్యాక్టరీలోని ప్యాకింగ్ ప్లాంట్‌లో పని చేస్తున్న 80 మంది కాంట్రాక్టు కార్మికులను కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ తొలగించాడన్నారు. ఈ విషయమై వారు ఆందోళన చేపట్టామన్నారు.

ముర్రుపాలు శిశువుకు శ్రేష్ఠం

- తల్లీ బిడ్డకు మేలు
- చిన్నారుల్లో పెరగనున్న రోగనిరోధక శక్తి
- అంగన్‌వాడీల్లో గర్భిణులకు అవగాహన
- ఈ నెల 7 వరకు కొనసాగనున్న తల్లిపాల వారోత్సవాలు



దుద్యాల్‌లో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

దుద్యాల్: పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, మొదటి టీకా అమ్మపాలే. పిల్లలకు ఇవి ఎంతగానో తోడ్పడుతాయని వైద్యులు చెబుతున్నారు. శిశువు జన్మించిన వెంటనే వీలైనంత త్వరగా ముర్రుపాలు పట్టించాలని డాక్టర్లు వివరిస్తున్నారు. ఈ పాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే తల్లి పాల ఆవశ్యకతను వివరించేందుకు ప్రతీ సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ అధికారులు తల్లిపాల వారోత్సవాలు జరుపుతున్నారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి తల్లి పాల ఆవశ్యకత, బిడ్డపోషణ, ఆరోగ్యం వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. లేనిపోని అపోహలతో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలకు దూరం చేయొద్దని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఉద్యోగులు, ఆయాలు ఆగస్టు 7వరకు తల్లిపాల వారోత్సవాలు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే మండల కేంద్రంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

ప్రోటీన్లు లభ్యం

శిశువు జన్మించిన తొలి రోజుల్లో తల్లి పాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. వీటిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. దీన్ని శిశువుకు తాగిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బిడ్డ పుట్టిన అర గంటలోపే ముర్రుపాలు పట్టడం ద్వారా రోగాల నుంచి బిడ్డను రక్షించుకోవచ్చు. ఈ పాలల్లో విటమిన్–ఏ, బీ, తగినంత ఐరన్ విలువలు లభ్యమవుతాయి. అంతేకాక జీర్ణశక్తిని పెంచే ఔషధగుణాలు ఉన్నాయి. కామెర్లు, విరేచనాలు వంటి రుగ్మతలు దరిచేరవు.

మండలంలో 20 అంగన్‌వాడీ కేంద్రాలు

దుద్యాల మండల పరిధిలో అన్ని గ్రామాల్లో 20 అంగన్‌వాడీ కేంద్రాలు కలవు. ప్రతీ గ్రామంలో దాదాపు 10 మంది వరకు బాలింతలు, గర్భిణులు ఉన్నారని, ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించి అందరికి అవగాహన కల్పిస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు చెబుతున్నారు.

డబ్బా పాలు తాగే పిల్లల కంటే..

తల్లిపాలలో ప్రోటీన్లు, లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్‌తో పాటు కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక శక్తి కల్గిన బ్యాక్టీరియా ఉంటాయి. తల్లిపాలు తాగే పిల్లలు ఎక్కువ బలంగా, వారిలో తెలివి తేటలు ఎక్కువగా ఉంటాయి. డబ్బా పాలు తాగే పిల్లల కంటే హుషారుగా ఉంటారు. బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది. ఈ పాలు తేలికగా జీర్ణమవుతాయి. ఎలాంటి ఇబ్బందులు ఉండవు. బిడ్డ ఎదుగుదలలో దవడలు బాగా ధృడంగా తయారవుతాయి. పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం దాల్చకుండా గర్భనిరోధకంగా కూడా పనిచేస్తుంది.

పిల్లల ఆరోగ్యానికి మేలు

బషీరాబాద్: తల్లిపాలే పిల్లలకు మేలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపిస్తే అనేక పోషకాలు అందుతాయని, బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మౌనిక, అంగన్‌వాడీ టీచర్ బాలమణి, ఏఎన్ఎం సైదమ్మ, ఆశావర్కర్ సువర్ణ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: తల్లీపాలే పిల్లలకు ఇవ్వాలని ఏఎన్ఎం లీలావతి అన్నారు. టేకులగడ్డ తండా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లీపాల వారోత్సవాలను నిర్వహించారు.

ముర్రు పాలు ఆరోగ్యం



బిడ్డకు తల్లిపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఎదుగుతారు. వారిలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. తల్లిపాలు ఇవ్వడం బాధ్యతగా భావించాలి. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలల వరకు తప్పని సరిగా తాగించాలి. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఐసీడీస్ పరిధిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నాం. తీసుకునే పౌష్టికాహారపదార్థాల గురించి కూడా అవగాహన కల్పిస్తున్నాం.

– రూప, ఐసీడీఎస్ సీడీపీఓ, కొడంగల్

తల్లి పాలే బిడ్డకు రక్ష

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి



బుగ్గాపూర్‌లో మాట్లాడుతున్న ధనలక్ష్మి

బంట్వారం: పుట్టిన బిడ్డకు తల్లిపాలే రక్షా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బాలింతలు తప్పనిసరిగా తల్లి పాలే తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఖయ్యూం, ఏఎన్ఎం హేమలత, టీచర్ పారిజాత తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేరుస్తా



హిందు ఉత్సవ సమితి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు పట్టణ శివారులోని ఖాంజాపూర్ గుట్టపై హిందు ఉత్సవ సమితికి కేటాయించిన స్థలంలో రూ.50లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హిందు ఉత్సవ సమితికి ఇచ్చిన హామీలో భాగంగా తొలి దశలో రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించానన్నారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భద్రేశ్వర దేవాలయానికి అన్నదానం కోసం భవన నిర్మాణం చేసినట్లు, జుంటిపల్లి సీతారాముల దేవాలయం, ఏకాంబర రామలింగేశ్వర దేవాలయానికి భక్తుల రాకపోకలకు రోడ్లు వేయిస్తున్నామన్నారు. గుడులతో పాటు బడులను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తాటికొండ స్వప్నపరిమళ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్‌రాజుగౌడ్, హిందు ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, బంటు వేణుగోపాల్, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎం ప్రమీల బదిలీ



బదిలీపై వెళ్తున్న ప్రమీలను సన్మానించిన ఐకేపీ సిబ్బంది

యాలాల: యాలాల మండలం నుంచి జనగామ జిల్లాకు ప్రమీలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె స్థానంలో చౌడాపూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను యాలాల మండలానికి కేటాయించారు. కాగా ప్రమీల బదిలీ కావడంతో ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు పూలమాల, శాలువా కప్పి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు బందెప్ప, క్రిష్ణయ్య, వెంకటయ్య, నర్సింహులు, సిబ్బంది చిరంజీవి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శికి సన్మానం



సన్మానం చేస్తున్న యువజన నాయకులు

కొడంగల్: యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శిగా నియమితులైన కొడంగల్‌కు చెందిన కృష్ణంరాజును యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. ప్రతీ కార్యకర్త పార్టీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జూనియర్ కృష్ణంరాజు, రాము, సాయిలు, రమేశ్, దస్తప్ప, రఘు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో శనివారం ఎస్వీఎస్ ఆస్పత్రి మహబూబ్‌నగర్ వారి ఆధ్వర్యంలో పల్లె బాలీశ్వర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 300ల మంది రోగులను పరీక్షించిన వైద్యులు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ భారత్‌నందన్‌రెడ్డి, గ్రామస్తులు లింగం, శ్రీనివాస్, నాగయ్య, కృష్ణయ్య, మల్లేశ్‌గౌడ్, రామోజీ, శంకరయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వసతుల కల్పనకు చర్యలు



భవిత కేంద్రంలో వివరాలు నమోదు చేస్తున్న ఎంపీడీఓ రాములు, డీఈ జితేందర్

ఎంపీడీఓ రాములు

బంట్వారం: కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ రాములు పేర్కొన్నారు. శనివారం ఆయన పంచాయతీ రాజ్ డీఈ జితేందర్‌తో కలిసి బంట్వారం కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆయాసమస్యలు తెలుసుకుని అవసరమైన పనులను గుర్తించారు. వాటికి సంబంధించిన ఎస్టిమేషన్ తయారు చేసి కలెక్టర్‌కు పంపిస్తానని డీఈ జితేందర్ పేర్కొన్నారు. అనంతరం భవిత కేంద్రంలో సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటరు జాబితా

తాండూరు రూరల్: పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు శనివారం వార్డుల వారీగా ఓటరు జాబితాను తయారు చేస్తున్నారు. తాండూరు మండలంలో 33 గ్రామాల్లో 40వేల ఓటర్లు ఉన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో ఏ వార్డు ఓటరు ఆదే వార్డుల్లో వచ్చేవిధంగా చూసుకోవాలన్నారు. ఇప్పటికే 31 గ్రామాల్లో వార్డుల వారీగా తయారైందన్నారు. కరన్‌కోట్‌లో 7,371, మల్కాపూర్‌లో 3,494 ఓటర్లు ఉన్నారు. ఓటర్లు ఎక్కువగా ఉండడంతో అక్కడ కార్యదర్శులు అందరూ కలిసి జాబితాను తయారు చేస్తున్నారు. ఆన్‌లైన్లో ఓటు నమోదు సమయంలో తప్పుగా వేరే గ్రామంలో నమోదయితే దాన్ని గుర్తించి ఆ ఓటరు సొంత గ్రామంలోని వార్డుకు వచ్చే విధంగా సరిచేయాలన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్న సిబ్బంది

పెండింగ్ గ్రాంటు విడుదల చేయాలి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

యాలాల: ప్రభుత్వ పాఠశాలల్లోని స్కావెంజర్ల పెండింగ్ గ్రాంటును వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..స్కూల్ ఫెసిలిటీ మెయింటెన్స్ గ్రాంటులో భాగంగా పాఠశాలల్లో స్కావెంజర్లను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, మొక్కలకు నీరు పోయడం తదితర పనులను స్కావెంజర్లు చేస్తున్నట్లు గుర్తు చేశారు. కాగా 2024–25 ఏడాదికి గాను మూడు నెలలకు సంబంధించిన గ్రాంటును మాత్రమే విడుదల చేశారని, మిగితా ఏడు నెలలకు సంబంధించిన గ్రాంటు పెండింగ్‌లో ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే..కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి పెండింగ్ గ్రాంటు విషయమై చర్చించారు. వారం రోజుల్లోగా పెండింగ్ గ్రాంటు విడుదల చేయిస్తామని కలెక్టర్ చెప్పినట్లు ఎమ్మెల్యే సంఘ నాయకులకు సమాధానమిచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు క్రిష్టారెడ్డి, రాములు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఇందోలు శ్రీధర్‌రెడ్డి, మొగులప్ప, నర్సిరెడ్డి, ఎల్.నర్సిరెడ్డి ఉన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- సీఐ శ్రీనివాస్‌రెడ్డి
- దోమ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ, రికార్డుల పరిశీలన



సిబ్బందికి సూచనలు, సలహాలిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

దోమ: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సీఐ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం దోమ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, క్వాటర్స్ భవనాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో ఎంట్రీ చేసి ఫాలో అప్ చేయాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. 100 డయల్ కాల్స్‌కు వెంటనే స్పందించి ఘటన స్థలానికి త్వరగా చేరుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో నిఘా పటిష్టంగా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాల నియంత్రణలో అవి సహకరిస్తాయన్నారు. ఇసుక, గంజాయి, డ్రగ్స్, గుట్కా లాంటి మత్తుపదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. విధి నిర్వహణలో ప్రతీ ఉద్యోగి బాధ్యతతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వద్య వసంత్ జాదవ్, హెడ్ కానిస్టేబుల్స్ నర్సింహులు, భీంరెడ్డి, కానిస్టేబుల్స్, హోంగార్డులు, మహిళ కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలకనుగుణంగా సాగు

మండల వ్యవసాయాధికారి తులసి



పర్సాపూర్‌లోని రైతు వెంకటప్ప పొలంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కొడంగల్ రూరల్: మట్టి నమూనాలకనుగుణంగా సాగు చేయాలని రైతులు తమ పంట పొలాల్లో సాగు పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి జి.తులసి పేర్కొన్నారు. శనివారం మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల పొలాల్లో మట్టి నమూనా సేకరణ ముమ్మరంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ తులసి మాట్లాడుతూ కొడంగల్ మండలానికి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద కొడంగల్ క్లస్టర్‌లో 425, పర్సాపూర్ క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో 125మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. రాజేంద్రనగర్‌లోని భూసార పరీక్షా కేంద్రానికి పంపించే ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. మండలంలోని పర్సాపూర్, మున్సిపల్ పరిధిలోని కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి, పాతకొడంగల్ గ్రామాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. మట్టిలో పోషకాహార స్థాయి, సేంద్రియ పదార్థాల శాతం వంటి కీలక సమాచారం లభిస్తుందన్నారు. వీటి ఆధారంగా సహజంగా మట్టిసారాన్ని పెంచడం, ఎరువులు వాడటం తదితర చిట్కాలతో భూమి సారాన్ని పెంచేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఏఈఓలు రాజు రాథోడ్, ఇసాక్ హెరాల్డ్, శ్రీపతి, సుమ, పావని, దేవేందర్, రైతులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సురక్ష బీమాతో లబ్ధి

కెనరా బ్యాంక్ డీజీఎం లోచన్



మాట్లాడుతున్న డీజీఎం లోచన్

నవాబుపేట: ప్రధానమంత్రి సురక్ష బీమాతో భవిష్యత్‌లో బాధిత కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని కెనరా బ్యాంక్ డీజీఎం లోచన్ పేర్కొన్నారు. అక్నాపూర్ గ్రామంలో శనివారం కెనరా బ్యాంకు పూలపల్లి శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 70 సంవత్సరాల వయసు గల ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాలని సూచించారు. సంవత్సరానికి రూ. 20 ప్రీమియంతో రూ.2లక్షల బీమా సదుపాయం కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన, అంగవైకల్యం కలిగిన రూ. 2లక్షల బీమా సొమ్ము బాధిత కుటుంబానికి చెల్లిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం సుధీర్ కుమార్, మేనేజర్ రూప శ్రావణి, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సిబ్బంది విజయ్, హన్మంత్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



తుంకిమెట్లలో రేషన్ కార్డుల ప్రొసీడింగ్ పంపిణీ చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు కొత్తగా రేషన్ కార్డులను మంజూరు చేసి భరోసా కల్పిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామంలో కొత్తగా మంజూరైన 89 రేషన్ కార్డుల ప్రొసీడింగ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సిములు గౌడ్, రాంచంద్రారెడ్డి, నాయకులు మల్లేశం, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అనీఫ్, బాల్‌రాజ్, చంద్రప్రకాశ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడి

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం



పెద్ద ఉమ్మెంతాల్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పూడూరు: పంటలు దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపడితే మొక్క ఎదుగుదలతో పాటు మంచి దిగుబడులు సాధించొచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాజరత్నం పేర్కొన్నారు. శనివారం పూడూరు మండల కేంద్రలోని రైతు వేదికలో పీఎం కిసాన్ 20వ వాయిదా విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి వీడియోకాన్ఫరెన్సులో వీక్షించారు. అనంతరం మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్‌లో పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంటలో పండాకుతెగుళ్లు వచ్చాయని వాటి నివారణకు మెగ్నిషియం సల్ఫేట్, తిబుల్ నైంటీన్‌ను వాడాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినకుండా వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ట వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు నిర్మల, పంకజ్, సహాయ సంచాలకులు లక్ష్మికుమారి, వ్యవసాయ అధికారి తులసిరాం, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.